క్లుప్తంగా

రంజాన్ నాటికి మసీదు పూర్తి చేయండి

కమిటీసభ్యులకు సూచించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట: రంజాన్ పర్వదినం నాటికి జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకునేందుకు నిర్మాణం సిద్ధం కావాలని కమిటీ సభ్యులను ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం వరవకట్టకు ఎదురుగా నిర్మాణంలో ఉన్న జామియా మసీదును పరిశీలించారు. జరుగుతున్న పనులను చూసి ఎప్పటికి పూర్తవుతాయని కమిటీ సభ్యులను అడిగారు. రంజాన్ పర్వదినం రోజుకి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మహబూబుబాషా, వరవకట్ట బాబు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి పర్యటన

శావల్యాపురం: స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ బుధవారం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 12 గంటలకు వేల్పూరు గ్రామంలోని బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం శానంపూడి, బొందిలిపాలెం, మతుకుమల్లి, కారుమంచి గ్రామాల్లో ఇరువురు విస్తృతంగా పర్యటించనున్నారు. కావున మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు.

ఎండుగుంపాలెం వాసికి పీహెచ్‌డీ



నాదెండ్ల: ఎండుగుంపాలెం గ్రామానికి చెందిన మొక్కపాటి అశోక్ భూపతి మద్రాస్ (కాంచీపురం) ట్రిపుల్‌ఐటీ నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇంజినీరింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో భూపతి చేసిన పరిశోధనలకు గాను పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం ఈయన సికింద్రాబాద్‌లోని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. బీటెక్ గుంటూరు వీవీఐటీలో, ఎంటెక్ జైపూర్ ఎన్ఐటీలో పూర్తి చేశారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మొక్కపాటి మల్లికార్జునరావు, ప్రమీల దంపతుల పెద్ద కుమారుడు భూపతికాగా, చిన్నకుమారుడు అఖిల్ బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అశోక్‌భూపతి పీహెచ్‌డీ సాధించటంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరగోరే విద్యార్థులు మే 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రవి నాయక్ మంగళవారం తెలిపారు. విద్యా బోధన ఆంగ్లంలో ఉంటుందన్నారు. పాఠశాలలో విద్యను అభ్యసించేందుకు ఎలాంటి ఫీజులు వసూలు చేయమన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఓసీ, బీసీలకు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.150లు ఫీజు చెల్లించాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ నిబంధనలకు లోబడి ప్రవేశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏపీజీఈఏ తాలూకా అధ్యక్షురాలిగా ఫ్లోరెన్స్



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నరసరావుపేట తాలూకా యూనిట్ అధ్యక్షురాలుగా ఎం.ఫ్లోరెన్స్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన సిద్ధాబత్తుని వెంకటేశ్వరరావు రాజీనామా చేయటంతో నూతన కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫ్లోరెన్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వివరించారు. కోటప్పకొండ పీహెచ్‌సీలో ఫ్లోరెన్స్ హెల్త్ సూపర్‌వైజర్‌గా ప్రస్తుతం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద కుమార్, తాలూకా యూనిట్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తాం

- డాక్టర్ గజ్జల, హనీఫ్, పిల్లి ఓబుల్ రెడ్డి
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో కలసి వెల్లడి
- మా మధ్య ఉన్నవి చిన్నచిన్న మనస్పర్థలే



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ గజ్జల, హనీఫ్, పిల్లి ఓబుల్ రెడ్డి

నరసరావుపేట రూరల్: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్ఏ హనీఫ్, జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి తెలిపారు. పల్నాడురోడ్డులోని డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి స్వగృహంలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. డాక్టర్ గజ్జల మాట్లాడుతూ 175 నియోజక వర్గాల్లో విజయం సాధించాలన్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆశయసాధనలో భాగంగా నరసరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి విజయం కోసం తామంతా ముందుండి పనిచేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు తనతో నడిచిన నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటానని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్ఏ హనీఫ్ మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి గతంలో కన్నా అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని తెలిపారు.

పార్టీ విజయం కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కుటుంబంలో చిన్నచిన్న అరమరికలు ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబంలో ఉన్న చిన్నపాటి సమస్యలను సామరస్యంగా పరిష్కారం చేసుకుని అందరం కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. పార్టీ నాయకుల మధ్య ఐకమత్యాన్ని దెబ్బతీసే విధంగా కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్టుల ద్వారా ప్రయత్నిస్తున్నారని అన్నారు. నియోజక వర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామని, రాష్ట్రంలో సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటామని తెలిపారు. ఎన్ని రాజకీయపార్టీలు కలిసి వచ్చినా, ఎన్ని దుష్ప్రచారాలు చేసినా వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సమావేశంలో డాక్టర్ కేజే మోహన్ రెడ్డి, డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాస రెడ్డి, సున్నీ, నేలటూరి మురళీ, బూర్లగడ్డ అంబేద్కర్ పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే వినుకొండ రూపురేఖలు మారుస్తా

- ఎమ్మెల్యే బొల్లా బొల్లాబ్రహ్మనాయుడు
- కొత్తపేటలోని 5, 6 వార్డులో ఎమ్మెల్యే బొల్లా ఎన్నికల ప్రచారం



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): గత టీడీపీ పాలనను, నేటి సంక్షేమ పాలనను చూసి ఎవరు మంచి చేశారో గుర్తించి ఓటు వేయాలని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తపేట పరిధిలోని 5, 6 వార్డులల్లో ఎమ్మెల్యే బొల్లా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో 2014 నుంచి 19 వరకు ప్రజలకు ఏఒక్క చెప్పుకోదగిన పనైనా చేశారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించామని, అందుకే ధైర్యంగా ఓటు అడుగుతున్నామన్నారు. గతంలో వినుకొండలో తాగునీటి సమస్యను సృష్టించి ట్యాంకర్ల ద్వారా కోట్ల రూపాయల ప్రజాధనం దోచు కున్నారని విమర్శించారు.

సమస్య పరిష్కరించకుండా ప్రతిఏటా దోచుకున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించామని మండు వేసవిలో కూడా తాగునీరు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఇదేవిషయం గుర్తించాలన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వినుకొండలో ప్రజలకు అభివృద్ధి పనులు జరుగకుండా అడ్డుపడటం తప్ప చేసిందేమీ లేదన్నారు.

టీడీపీ వస్తే ప్రజల ఆస్తులకు రక్షణ కరువు

టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని గతంలో పేదల ఆస్తులు బెదిరించి లాక్కున్నారని. తమ ప్రభుత్వం హయాంలో అందరికీ రక్షణ కల్పించామన్నారు. గతంలో వ్యాపారులను కూడా బెదిరించి అక్రమ వసూలు చేశారని గుర్తు చేశారు. తమ హయాంలో వ్యాపారులు ప్రశాంతంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రికి వస్తున్న ప్రజాదరణను చూసి ఒంటరిగా గెలువలేకనే జనసేన, బీజేపీ, వామపక్షాలు, ఎమార్పీఎస్, లోక్‌సత్తా వంటి పార్టీలతో అనైతిక పొత్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఎంతమంది కూటములైనా అంతిమ విజయం తమదేనన్నారు. నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనీల్‌కుమార్ యాదవ్, వినుకొండ అభ్యర్థినైన తనకు ఓట్లు వేసి గెలిపించాలని మరో అవకాశం ఇస్తే వినుకొండను రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు మళ్లీ పట్టంకట్టండి

- పేదల పక్షాన జగనన్న.. పెత్తందార్లతో చంద్రబాబు !!
- వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు



పట్టణ ప్రముఖులతో సమావేశంలో కావటి మనోహర్‌నాయుడు

యడ్లపాడు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు కోరారు. మండలంలోని జగ్గాపురం గ్రామంలో ఆయన పర్యటించారు. తొలిసారిగా గ్రామానికి విచ్చేసిన ఆయనను పార్టీ శ్రేణులు సాదర స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని మస్తానయ్య దర్గా, ఎస్టీ కాలనీలోని గ్రామదేవత చెట్టువద్దను దర్శించుకున్నారు. రెండు ఎస్సీకాలనీల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే రామాలయం, ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పార్టీ ముఖ్య నాయకులు నివాసాలకు వెళ్లి పరిచయం చేసుకుంటూ ఆత్మీయ సమావేశాలను ఏర్పాటు చేశారు. జగనన్న ఐదేళ్ల పాలనలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు చేకూరిన సంక్షేమ పథకాలను గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలకు నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా కె.అనిల్‌కుమార్ యాదవ్, చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థిగా తాను పోటీ బరిలో ఉన్నామన్నారు. కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలను అందిస్తూ పారదర్శక పాలన చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ శ్రేణులు, ప్రజలు అండగా ఉండి మరోమారు దీవించాలని కోరారు. వలంటీర్ వ్యవస్థ ఇలానే కొనసాగాలన్నా.. సంక్షేమ ఫలాల లబ్ధి అర్హులందరికీ దక్కి అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక అభ్యున్నతి సాధించాలంటే వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజలే సైన్యంగా జగన్..పెత్తందార్ల పొత్తులో చంద్రబాబు రానున్న ఎన్నికల్లో యుద్ధంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, నాయకులు మాదం శ్రీను, ఎంపీబాలచంద్రారెడ్డి, జగ్గాపురం నాయకులు వైఎస్సార్ నాయుడు, తెనాలి అంకమ్మరావు, రామారావు, మారిశెట్టి వీరప్రసాద్, మాజీ సర్పంచ్ సూరం శేషయ్య, బైరిశెట్టి రాఘవయ్య, తులసీ రాఘవయ్య, చౌడవరపు రామారావు, బత్తినేటి వెంకటేశ్వర్లు, వెంగళశెట్టి అప్పారావు, పందుల బుల్లెబ్బాయి, దావాల నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, కొండెపాగ మోషే, నర్సయ్య, నూతక్కి పెద్దబ్బాయ్, హేంబాబు, ఉయ్యాల తిరుపతయ్య, వి.శ్రీనివాసనాయక్, వి.సాయి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయఢంకా మోగిద్దాం

చిలకలూరిపేట: సమష్టి కృషితో విజయఢంకా మోగిద్దామని..వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. పట్టణంలో విస్తృత స్థాయిలో మంగళవారం పర్యటించారు. పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులను కలసి ఎన్నికల్లో విజయానికి సహకరించాలని కోరారు. పర్యటనకు వచ్చిన ఆయనకు ప్రతిచోటా ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మనోహర్‌నాయుడు మాట్లాడుతూ విజయమే పరమావధిగా ఎన్నికలకు సంసిద్ధం కావాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టా విజయభాస్కర రెడ్డి, పట్టణ అధ్యక్షుడు క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రి, సయ్యద్ సిరాజ్, తాళ్ల అంజిరెడ్డి, నకరికంటి శ్రీకాంత్, పురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోండి



షోలాయపాలెం గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారి



గణపవరం గ్రామ లైబ్రరీ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంసీసీ స్క్వాడ్ హెడ్ షేక్ జాకీర్ హుస్సేన్

- ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలి
- బెదిరింపులకు పాల్పడితే కఠినచర్యలు

బొల్లాపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలని తహసీల్దార్, ఏఆర్‌వో బి.వి.రమణారావు తెలిపారు. మండలంలోని గండిగనుమల సచివాలయ పరిధిలోని షోలాయపాలెం గ్రామాన్ని తహసీల్దార్‌తో పాటు ఎన్నికల అధికారులు మంగళవారం సందర్శించారు. గ్రామం నుంచి కొందరు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆదేశాల మేరకు గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించామని తహసీల్దార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పూర్తిస్థాయిలో గ్రామాల్లో బందోబస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద బెదిరింపులకు పాల్పడినా, ఓటర్లను బెదిరించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమాచారం ఇస్తే తక్షణమే తగుచర్యలు ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డి.చెన్నకేశవులు ఈ మేరకు హెచ్చరించారు.

గ్రామాన్ని సందర్శించిన వారిలో ఎంపీడీవో, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వి.ఎ.విజయ్‌కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్‌కే జిలానీ బాషా ఉన్నారు.

గణపవరంలో ఎంసీసీ స్క్వాడ్ తనిఖీలు

నాదెండ్ల: పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎలాంటి రాజకీయ పార్టీల కార్యాలయాలు గానీ, ఫ్లెక్సీలు, బ్యానర్‌లు, ప్రచార సాధనాలు ఉండకూడదని ఎంపీడీవో, ఎంసీసీ స్క్వాడ్ హెడ్ షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. గణపవరంలోని 15 పోలింగ్ బూత్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. గ్రామ నడిబొడ్డున రెండు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రచార వాహనాలకు ఈఆర్‌వో నుండి అనుమతులు తీసుకున్న తర్వాతనే ప్రచారాన్ని ప్రారంభించాలన్నారు. అభ్యర్థి పాల్గొనే ఇంటింటి ప్రచార కార్యక్రమానికి కూడా అనుమతులు తీసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ద్వారా జెండాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు తొలగించామని, శిలాఫలకాలు, జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఎక్కడా ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా నడుచుకోవాలని ఆదేశించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు, సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు ఉన్నారు.

టీడీపీ కూటమికి ఓటు వేస్తే పేదలకు అన్యాయమే

ఒకటో వార్డు సత్తెనపల్లి రోడ్డులో ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



స్థానికులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి ఓటు వేస్తే పేద ప్రజలు అన్యాయమై పోతారని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి పట్టణంలోని ఒకటో వార్డు సత్తెనపల్లిరోడ్డు, కూనిశెట్టి సత్రం వెనుక భాగంలో పర్యటించారు. స్థానికులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ తిరుగుతూ ఇప్పటివరకు ఏమి పథకాలు అందుతున్నాయో తెలుసుకొన్నారు. నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమానికి చెందిన కరపత్రాన్ని అందజేసి వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంటు అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ అనీల్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా వార్డు పరిధిలోని మహిళలు ఏర్పాటు చేసిన కేకు కట్ చేసి వారితో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ నెరవేర్చితే చంద్రబాబు మోసం చేశాడని గుర్తు చేశారు. ఈ వార్డులో జగనన్న ఇళ్లపట్టాలు 318మందికి ఇచ్చామన్నారు. అందనివారి కోసం ములకలూరు గ్రామపరిధిలో పది ఎకరాలు సేకరించామని, రెండోఫేజ్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇవ్వటం జరుగుతుందన్నారు. వలంటీరు వ్యవస్థ చాలా బాగుందని వారి ద్వారా ఒకటోతేదీన పింఛన్లు ఇళ్లవద్దకు వచ్చి అంద చేస్తున్నారన్నారు. చదువుపై ప్రత్యేక దృష్టి సారించి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు బాగుచేసి ఆంగ్లమీడియంతో పేద పిల్లలకు చదువులు చెప్పిస్తున్నాడన్నారు.

కరోనా కష్టకాలంలో సైతం ఇచ్చిన మాట ప్రకారం అన్నీ సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. వచ్చే ఎన్నికల అనంతరం అందరికీ మళ్లీ పథకాలు, ఇళ్లపట్టాలు అందజేస్తారన్నారు. అందరూ గుర్తుపెట్టుకొని సీఎం జగన్‌ను బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, కనీస వేతన అమలు బోర్డు జిల్లా సభ్యుడు రామిశెట్టి కొండలరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి ఎన్‌కే ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి బాబ్జి, మాడిశెట్టి వెంకటేశ్వర్లు, కారుమంచి మీరావలి, మాగులూరి రమణారెడ్డి, సయ్యద్‌బాబ్జి, వార్డు నాయకులు బండి వాసంతి, మక్కెళ్ల మల్లికార్జునరావు, చీమకుర్తి శేఖర్, దాసరి శ్రీనివాసరావు, నిమ్మశెట్టి తిప్పరయ్య, గోల్డ్ మస్తాన్, ఈవూరి రామిరెడ్డి, సయ్యద్ పెద్దఖాజా, సీహెచ్. అనురాధ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి ఆగని వలసలు



వినుకొండ(నూజెండ్ల): శావల్యాపురం మండలం కనమర్ల పూడి గ్రామంనుంచి పది కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వినుకొండ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా బొల్లా మాట్లాడుతూ పార్టీలో చేరిన వారిని కుటుంబసభ్యులుగా భావించి అన్నీ విధాలా ప్రాధాన్యతని ఇస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కండక్టర్‌కు రూ.500 జరిమానా

నరసరావుపేట టౌన్: విధులకు ఆటంకం కలిగించిన కేసులో మహిళా కండక్టర్‌కు రూ.500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ టి. ప్రవల్లిక మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఫిబ్రవరి 26వ తేదీ 2021వ సంవత్సరంలో నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మహ్మద్ సలాం పనిచేశారు. ఆ సమయంలో మహిళా కండక్టర్ ప్రభావతి తన పట్ల దురుసుగా ప్రవర్తించటంతో పాటు విధులకు ఆటంకం కలిగించిందని సలాం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితురాలిపై అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి రూ.500 జరిమానా, అవి చెల్లించకుంటే వారం రోజులు జైలు శిక్ష విధించేలా తీర్పు చెప్పారు.

బకాయిలు చెల్లించకుంటే కుళాయిలు తొలగించండి

పన్ను వసూలుపై సమీక్ష నిర్వహించిన మున్సిపల్ కమిషనర్



పన్నుల వసూలుపై మున్సిపల్ అతిథి గృహంలో సమీక్ష చేస్తున్న కమిషనర్

నరసరావుపేట: ఆస్తిపన్ను, నీటి పన్నులు మొండిబకాయిలు ఉన్నవారి ఇళ్లకు ఉన్న నీటి కుళాయిలను తొలగించి ఆపై లీగల్ నోటీసు జారీచేసి జప్తుకు కూడా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఇళ్లు, నీటి పన్ను వసూలుపై రెవిన్యూ, సచివాల సిబ్బందితో మున్సిపల్ అతిథిగృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కేటాయించిన టార్గెట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ కేవలము ఐదు రోజులు మాత్రమే వున్నందున ఇంకనూ చెల్లించనివారు వెంటనే చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని సూచించారు. రాయితీ గడువు ముగియనున్నది కనుక త్వరగా పన్ను బకాయిలను కట్టించాలని అన్నారు. పన్ను బకాయిలు కలెక్షన్‌కి సంబంధించి ప్రత్యేక మొబైల్ కౌంటర్లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, కార్యాలయంలో కూడా రెండు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ ఇంజనీర్ కనకారావు, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బర్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇళ్లముందున్న కాలువల్లో పూడిక తీయించుకోండి

ఇళ్ల యజమానులు దగ్గర ఉండి ఇళ్లముందున్న మురికి కాలువల్లో ఉన్న పూడికను పారిశుద్య సిబ్బంచే తీయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఒకటో వార్డులోని సీబీ కాలనీ, నాల్గవార్డులోని పనసతోట ప్రాంతాల్లో డ్రైనుల్లోని పూడిక తీసే ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వార్డు ప్రజలతో మాట్లాడుతూ తమ వర్కర్లు వచ్చినప్పుడు మీ ఇళ్ల ముందు కాల్వలపై ఏర్పాటుచేసిన బండలు తొలగించి సహకరించాలని సూచించారు. పనులను సంబంధిత వార్డు సెక్రటరీ పర్యవేక్షించాలని ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన

రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు పంటల మార్పిడి విధానంపై అవగాహన కలిగించారు. విలేజ్ మ్యాప్ ద్వారా రైతులకు పంటల సాగు విధానంపై వివరించారు. పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వచ్చే పంటలు సాగు చేరుకోవాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పైర్లకు వచ్చే చీడపీడల నివారణకు వాడవలసిన మందులు గురించి వివరించారు. రసాయనిక ఎరువులు కంటే సేంద్రీయ ఎరువులు ఎక్కువగా వాడాలన్నారు. ఒక పంటను ఎక్కువ సార్లు సాగు చేయకుండా పంటల మార్పిడి పద్ధతి అవలంభిస్తే భూసారం పెరిగి పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. అదే విధంగా రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం కల్పిస్తున్న కనీస మద్దతు ధర గురించి వివరించారు. విలేజ్ మ్యాప్ ద్వారా పంటల సాగు విధానం రైతులను విశేషముగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తకు సన్మానం



శాస్త్రవేత్త డాక్టర్ అల్లాబక్షిని సన్మానిస్తున్న దృశ్యం


చిలకలూరిపేటటౌన్: సరైన లక్ష్యాలను ఎంచుకొని, వాటి సాధనకు కృషి చేస్తే విజయాలు వరిస్తాయనటానికి యువశాస్త్రవేత్త డాక్టర్ షేక్ అల్లాబక్షి నిదర్శమని పలువురు కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ ఎదురుగా ఉన్న మెహర్‌బాబా మందిరంలో డాక్టర్ షేక్ అల్లాబక్షికు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రిటైర్డ్ ఉపాధ్యాయులు పట్టాభి రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ పేదకుటుంబంలో పుట్టి సివిల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేసి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేసి, అమెరికాలోని ప్రభుత్వరంగ సంస్థ కనెక్టికట్ రీసెర్చ్ స్టేషన్‌లో శాస్త్రవేత్తగా ఎదిగారని కొనియాడారు. ఇంతటి ఉన్నత స్థాయికి కారణమైన అల్లాబక్షి తల్లిదండ్రులు సలీం దంపతులను ప్రశంసించారు. కార్యక్రమంలో జిలాని, సనా, వంశీకృష్ణ,ఉమర్, దివి రామబ్రహ్మం, డాక్టర్ పీవీ సుబ్బారావు, జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మ మద్దిరావమ్మ



పెదకూరపాడు: చల్లంగా చూడమ్మా... మద్దిరావమ్మా.. అంటూ భక్తులు మండలంలోని లగడపాడు గ్రామంలో కొలువైన మద్దిరావమ్మ అమ్మవారి పునః ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని, వేడుకున్నారు. గ్రామ దేవత మద్దిరావమ్మకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పాడి పంటలతో చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేల్పూరులో పోలీసు కవాతు



గ్రామంలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ వర్మ

శావల్యాపురం: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజల సహకరించాలని నర్సరావుపేట డీఎస్పీ సత్యనారాయణ వర్మ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో ఆయన మంగళవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందకు ముందస్తు భద్రతా చర్యలో భాగంగా గ్రామాలల్లో పర్యటిస్తున్నట్లు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టడం జరిందిన్నారు. ఎన్నికల నియమావలిని ప్రతి ఒక్కరూపాటించాలని సూచించారు. నిబంబధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సి.ఐ సుధకర్ బాబు లతోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.